క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

తాంసి: మండలంలోని పొన్నారిలో శ్రీమహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో పండితుల మంత్రోచ్ఛరణల మధ్య హోమం, అర్చనతో పాటు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మీ దేవిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింగ్ చారి, గ్రామపెద్దలు అశోక్, రఘు, రమణ, లింగన్న పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ పతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామంలో శ్రీ మహాలక్ష్మీ దేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం జలాధివాసం, కలిశ స్థాపన, పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, బలి హరణం, తదితర కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు గడుగు శ్రీనివాస్, మేరుగు మోహన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాపూరావు, బరకం మల్లేష్, మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కైలాస్‌నగర్: కిడ్నీవ్యాధితో బాధపడుతున్న బేల మండలం అవాల్‌పూర్ గ్రామానికి చెందిన గేడం మోహన్‌కు వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. డయాలసిస్ చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధి అల్లూరి భూపతి రెడ్డి, గ్రామానికి చెందిన ఎల్టి కృష్ణారెడ్డి, మినక జలందర్ రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం బాధితుడికి నగదు అందజేశారు.

పంట మార్పిడి పాటించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

బోథ్: రైతులు పంట మార్పిడి పాటించాలని వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ డా.శ్రీధర్ అన్నారు. గురువారం మండలంలోని కౌట(బి) గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అధిక మొత్తంలో రసాయన ఎరువులు వాడవద్దన్నారు. యూరియాను తక్కువ మోతాదులో వాడాలన్నారు. మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేశ్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలి



ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఇచ్చోడ: విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించాలని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. గురువారం ఇచ్చోడ, గుడిహత్నూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో అధ్యాపకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్య బోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇచ్చోడ డిగ్రీ కళాశాలలో ఎంతో అనుభవం ఉన్న అధ్యాపకులు ఉన్నట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సర్వస్వతి, అధ్యాపకులు మధు, మురళి, అనిత, నర్సయ్య, దయాకర్, విజయ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

- మొక్కలు నాటిన అధికారులు, నాయకులు



నేరడిగొండ: మొక్కలు నాటుతున్న ఉద్యోగులు



ఇంద్రవెల్లి: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని మండల అటవీశాఖ అధికారి సంతోష్ అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీశాఖ సిబ్బందితో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ ఎఫ్ఎస్‌వోలు రాజేందర్, గోవింద్, కాంగ్రెస్ నాయకులు జితేందర్, నాగోరావ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని పటేల్ కేఎస్ఆర్ ఉద్యోగులు సూర్యనారాయణ, రామ్మోహన్ రెడ్డిలు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్‌హెచ్ఏఐ, పటేల్ కేఎస్ఆర్, అంబులెన్స్ సభ్యులు గురువారం 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్లలో మొక్కలు నాటారు.

ఇచ్చోడ: పర్యావరణ పరిరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత అని ముఖరా(కె) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్‌లు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పురుషోత్తం, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఇచ్చోడ: ముఖరా(కె)లో..



నార్నూర్: మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

నార్నూర్: పర్యావరణ పరిరక్షణ మన ఇంటి పరిశుభ్రతతోనే ప్రారంభించాలని బీజేపీ మండలాధ్యక్షుడు భిక్షపతి రాథోడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. స్వచ్ఛందంగా పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ముందుకు రావాలన్నారు. ప్రతిఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించాలన్నారు. బీజేపీ నాయకులు హన్మంతరావు, శ్రావణ్, శ్రీ ను, మహేందర్, కపిల్, సంతోష్, రమేశ్ పాల్గొన్నారు.

గాదిగూడలో..

గాదిగూడ మండల కేంద్రంలో సీపీఎస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ర్యాలీ నిర్వహించి, కుమురంభీం చౌక్ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ నాగోరావు, మాజీ సర్పంచ్ జైవంతరావు, సీసీలు చౌహాన్ సురేశ్, హెచ్‌కే జగ్గేరావు, అడే సచిన్, మెస్రం అరుణ, అనసూయ పాల్గొన్నారు.

గుడిహత్నూర్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని స్వదేశీ జాగరణ మంచ్ జిల్లా కో కన్వీనర్ నాగుల సతీష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పలు వీధుల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సభ్యులు రమేశ్, నవీన్, శ్రీకర్ పాల్గొన్నారు.

భాగస్వామ్యులు కావాలి

కైలాస్‌నగర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు పిలుపునిచ్చారు. బల్దియా ఆధ్వర్యంలో చేపట్టిన వంద రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో వనమహోత్సవం నిర్వహించారు. బల్దియా అధికారులు, ఉద్యోగులతో కలిసి పలు మొక్కలు నాటారు.



మొక్క నాటుతున్న కమిషనర్ రాజు

కార్యక్రమంలో డీఈ కార్తీక్, ఆర్‌వో కల్యాణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ అవి కిరణ్, ఆర్ఐ

రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్ కుమార్



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్యాంసుందర్

- ఆర్డీవో వినోద్ కుమార్

తలమడుగు: గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని కుచులాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సులో పాల్గొని, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 20 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. భూ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం రెవెన్యూ సదస్సులు పక్కాగా నిర్వహించాలన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజమోహన్, డీటీ ప్రభాకర్, ఆర్ఐ, సిబ్బంది సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: భూభారతి చట్టం భూసమస్యకు పరిష్కార వేదిక అని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్యాందర్ అన్నారు. గురువారం మండలంలో కిన్నెరపల్లి, బోస్రా గ్రామాల్లో భూభారతిపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నయబ్ తహసీల్దార్ హీరాలాల్, ఆర్ఐ నూర్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్ రెడ్డి, కరుణకర్‌రెడ్డి, రమేశ్, భోజన్న, వికాస్ గౌతం పాల్గొన్నారు.

బోథ్: బోథ్, సొనాల మండలాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. గురువారంసొనా ల మండలంలోని పార్డి(కె) గ్రామంలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఏవైనా భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. పార్డీ, పుణ్యానాయక్ తండా గ్రామాల్లో నివాస గృహాలు కలిగిన వారి పేర్లను రెవెన్యూ రికార్డుల్లోంచి తొలగించ లేదని, భూమిని సర్వే చేసి గ్రామకంఠంగా నమోదు చేయాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్యాంసుందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు



ప్రొసీడింగ్ పత్రాలతో లబ్ధిదారులు

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. సీనియర్ నాయకుడు రమేశ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, శ్రీనివాస్, అశోక్, అఫ్రోజ్, రాజాలింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్, చించోలి, దర్మంపూరి, జల్దా గ్రామాల్లో గురువారం ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో లక్ష్మణ్ భూమిపూజ చేసి, ప్రొసీడింగ్ పత్రాలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 516 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రొసీడింగ్ తీసుకున్న వారు పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మహేందర్, కారోబారి గోగరి సూభాష్, గోవర్ధన్

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నేరడిగొండ: పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. గురువారం మండలంలోని వడూర్, కుంటాల(కె) గ్రామాల్లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని పేద ప్రజలతో పాటు బడుగు, బలహీన వర్గాల వారిని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కాంగ్రెస్ ఎల్లప్పుడు సామాన్యుడి పక్షాన ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆడే వసంత్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న ఆడే గజేందర్

కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

ఇంద్రవెల్లి: ఎస్సీ మహార్ కులానికి నోటరీ లేకుండా తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ అన్నారు. గురువారం ఉట్నూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ మహార్ కులస్తులు కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్నారని, ప్రస్తుతం నిబంధనల ప్రకారం కుల ధ్రువీకరణ పత్రం పొందాలంటే రూ. 700 నుంచి రూ. 1000 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కామ్‌రాజ్ వాగ్మరే, దిలీప్ మోరే, మస్కే రాజువర్ధన్, శివాజీ, సత్యానంద్ పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు నిలువ ఉండకుండా పరిసరాల, వ్యక్తిగత శుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు సౌకర్యంలేని గ్రామాల్లో గర్భిణులను ముందస్తుగా ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించాలన్నారు. సమావేశంలో వైద్యులు జితేందర్‌రెడ్డి, హెచ్‌ఈవో రాథోడ్ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు వైద్యాధికారి మనోహర్

ఇచ్చోడకు మహారాష్ట్ర కూరగాయలు

ఇచ్చోడ: మహారాష్ట్రలోని లాతుర్ ప్రాంతంలో పండించిన కూరగాయలు ఇచ్చోడ మార్కెట్‌కు వస్తున్నాయి. మండలంలోని అడేగామ(బి) గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి మహేందర్ లాతుర్ ప్రాంతంలో పండిస్తున్న కూరగాయలు కొనుగోలు చేసి ఇచ్చోడ మార్కెట్‌కు తీసుకవస్తున్నాడు. ప్రస్తుతం జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణం భారీగా తగ్గిపోవడం, కూరగాయల కొరత తీవ్రంగా ఉంది, దీంతో పలురకాల కూరగాయలు రేట్లు రెండింతలు పెరిగాయి. దీంతో కూరగాయల వ్యాపారి మహేందర్ మహారాష్ట్రలో కొనుగోలు చేసి ఇచ్చోడ, నేరడిగొండ, బజార్‌హత్నూర్, గుడిహత్నూర్, బోథ్ ప్రాంతాల్లోని చిరువ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రతీరోజు లక్ష రుపాయల కూరగాయలు కొనుగోలు చేస్తూ.. వ్యాపారులకు విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.



లాతుర్ నుంచి తీసుకువచ్చిన కూరగాయల లోడ్

'రాజకీయ కుట్రతో తప్పుడు ప్రచారం'

ఇచ్చోడ: రాజకీయ కుట్రతో మా కుటుంబంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇచ్చోడ మాజీ సర్పంచ్ చౌహన్ సునీత, మాజీ ఎంపీటీసీ చౌహన్ దేవనంద్‌లు అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. మా కుటుంబం ఎస్టీ కాదని తప్పుడు ప్రచారం చేస్తున్నరని, జిల్లా కలెక్టర్‌పై రాజకీయ ఒత్తిలతోనే ఎస్టీ కాదని ఉత్తుర్వులు జారీ చేయించారని ఆరోపించారు. కలెక్టర్ ఉత్తర్వులు స్వీకరించినట్లు తెలిపారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన



అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నార్నూర్: ప్రైవేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాబోధనలు చేస్తున్నామని, ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు నరేశ్, సుజాతలు కోరారు. గురువారం పలు గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ప్రభుత్వ కళాశాల పనితీరు, విద్యాబోధనలపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌లు పొందాలని సూచించారు.

ఎన్ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

కైలాస్‌నగర్: ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) 2024–25కు సంబంధించి గతేడాది నవంబర్ 24న జరిగిన రాత పరీక్ష ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎనుగు శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులు http// br-c.teanfana.gov.in వెబ్‌సైట్‌లో ఫలితాలు చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభం

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 2025 ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ), (ఎంఎస్‌సీఎస్), (బీజెడ్‌సీ), (ఎంజెడ్‌సీ), బికాం (కంప్యూటర్), (జనరల్), బీఏ (హెచ్‌ఈపీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థులు ఈనెల 23లోగా దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. వివరాలకు 87900 09838పై సంప్రదించాలని కోరారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: క్షయ రహిత సమాజంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా క్షయ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ నిఖత్ అన్నారు. గురువారం నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బుగ్గారం(బి) గ్రామంలో క్షయపై అవగాహన కల్పించారు. వ్యాధి ముదిరితే మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్ఎం జ్యోతి, కమల, స్వామి, రమాదేవి, గౌరుబాయి, అంగన్‌వాడీ టీచర్ కవిత పాల్గొన్నారు.

15 రోజులు అందుబాటులో ఉంటాం

బేల: ఆదిలాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ప్రతీ నెలలో ప్రతి 15రోజులు స్థానికంగా అందుబాటులో ఉంటానని కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు భార్గవ్ దేశ్‌పాండే అన్నారు. గురువారం మండల కేంద్రంలో పలువురు నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటికీ ఆదిలాబాద్ నియోజకవర్గంలో చాలా మంది సీనియర్ నాయకులు, కార్యకర్తలకు ఆదరణ లేక అసంతృప్తితో ఉన్నారన్నారు. వీరందరినీ కలుస్తూ మనోధైర్యం నింపేందుకు స్థానికంగా వారి వేంట అండగా ఉంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట ఆదిలాబాద్ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ గాలి సంజయ్, జిల్లా నాయకులు దేవ్‌తాళే మంగేష్, అల్లూరి రాంరెడ్డి, విజయ్‌కుమార్, సృజన్‌రెడ్డి, ఎండీ అఖిల్, రాకేశ్ పాల్గొన్నారు.



భార్గవ్ దేశ్‌పాండేను సన్మానిస్తున్న నాయకులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కైలాస్‌నగర్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతంలో ప్రకటించినట్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులకు సంబంధించి ప్రతినెల రూ.500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిద్దిపేటలో జరిగిన సంఘం ద్వితీయ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలతో పాటు ఈ కుబేర్‌లో మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల జీపీఎఫ్ పార్ట్ ఫైనల్, లోన్, మెడికల్ బిల్స్, సరెండర్ బిల్లులు, టీఎస్ఎల్ఐజీ వంటి అన్నిరకాల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, 51శాతం ఫిట్‌మెంట్‌తో జూలై 1, 2023 నుంచి పీఆర్‌సీని అమలు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న బి.రవీంద్ర

జొన్నలు కొనుగోలు చేయాలని రాస్తారోకో

జైనథ్: జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు గురువారం మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం ఎనిమిది గంటలకు మార్కెట్ యార్డ్‌కు వాహనాలతో వస్తే లోనికి అనుమతించడంలేదన్నారు. కలెక్టర్ ఆదేశాలతో రెండు రోజుల గడువు పొడిగించడంతో జొన్నపంట మార్కెట్ యార్డ్‌కు తీసుకువచ్చామన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డితో మాట్లాడగా నాణ్యమైన పంటను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ సిద్ధంగా ఉందని, రైతులు తీసుకువచ్చిన పంట డ్యామేజ్ ఉండడంతో కొంత ఇబ్బందికరంగా ఉందన్నారు.



రాస్తారోకో చేస్తున్న రైతులు